జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
గురువారం 08 అక్టోబర్ 2026 పేజీలు:09



## జమీర్ పాషాను సన్మానించిన - ఎంపీడీకే అరుణ

**నారాయణపేట ప్రతినిధి, అక్టోబర్ 07 (ప్రజా జ్యోతి):**
భారతీయ జనతా పార్టీ నారాయణపేట జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా డాక్టర్ జమీర్ పాషా ఎన్నిక అయినా సందర్భంగా ఉమ్మడి పాలమూరు జిల్లా పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ వివాసంలో జమీర్ పాషా ను శాలువాతో సన్మానించడం జరిగింది.

మిగతా 2 లో

# రైతులకు అధిక ఆదాయం వచ్చేలా కార్యాచరణ




- వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్, ఎగుమతులపై దృష్టి పెట్టాలి
- 17 రైతు ఉత్పత్తి సంఘాలను 'పాలమూరు బ్రాండ్'గా తీర్చిదిద్దాలి: కార్యదర్శి సురేంద్ర మోహన్

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి బ్యూరో):**
రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా వ్యవసాయ, ఉద్యాన పంటల ద్వారా అధిక ఆదాయం పొందేలా అధికారులు సమగ్ర ప్రణాళికతో చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల కార్యదర్శి కే. సురేంద్ర మోహన్ సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ, మార్కెటింగ్, సహకార శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వర్షపాతం పరిస్థితులు, ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోళ్లు, రబీ ప్రణాళిక, పత్తి, జొన్న తదితర పంటల సాగు, కనీస మద్దతు ధర, ఫార్మర్ ఐడీ, ఆయిల్‌పామ్, మల్బరీ సాగు తదితర అంశాలపై సమీక్షించారు.

మిగతా 2 లో



## నర్వలో ఎల్ఓసి లను అందజేసిన - మంత్రి వాకిటి శ్రీహరి

**నర్వ అక్టోబర్ 7 ప్రజా జ్యోతి**
నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలోని కాంగ్రెస్ నాయకులు మాది రెడ్డి జలంధర్ రెడ్డి నివాసంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా నర్వ మండలం కల్వాల్ గ్రామానికి చెందిన నాగార్జున గౌడ్ కు 2 లక్షల రూపాయలు అదేవిధంగా పెద్ద కడ్మూర్ గ్రామానికి చెందిన జక్కుల శ్రీనివాస్ లకు 4 లక్షల రూపాయల ఎల్ ఓ సి లను మంత్రి వాకిటి శ్రీహరి గారు అందజేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో జరుగుతున్న రోడ్ల అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు, పనులను త్వరతగతిలో పూర్తి చేయాలని ఆదేశించారు, ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు చెన్నయ్య సాగర్, నర్వ గ్రామ సర్పంచ్ హనుమంత్ రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణ రెడ్డి. మండల నాయకులు జగన్మోహన్ రెడ్డి, డి కృష్ణారెడ్డి జగదభిరామరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యమైన జీవనానికి ణ్యకరమైన పోషకాహారం అవసరం. సిడిపిఓ

**-ఘనంగా 9వ రాష్ట్రీయ పోషణ మహోత్సవ కార్యక్రమం**

**చిన్నంబావి, అక్టోబర్ 07 (ప్రజా జ్యోతి)**
చిన్నంబావి మండలం కొప్పు నూరు గ్రామ రైతు వేదికలో మండల స్థాయి ఘనంగా 9వ రాష్ట్రీయ పోషణ మహోత్సవ కార్యక్రమం గ్రామ సర్పంచ్ వడ్డేమాన్ బిచ్చన్న. ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలకు పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మిగతా 2 లో



# పెద్ద చెరువుకు కొత్త కళ.. నగరవాసులకు ఆహ్లాదం!

## – రూ.1.50 కోట్లతో వాకింగ్ ట్రాక్, పిల్లల ఆటస్థలం, గ్రీన్ జోన్

## – శిల్పారామంలో మహిళా సంఘాలకు స్టాళ్లు ప్రారంభం

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి బ్యూరో):** మహబూబ్‌నగర్ పట్టణ నడిబొడ్డున ఉన్న పెద్ద చెరువు మినీ ట్యాంక్ బండ్ సరికొత్త రూపు సంతరించుకుంది. నగరవాసులకు ఆహ్లాదంతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన వాకింగ్ ట్రాక్, పిల్లల ఆటస్థలం, గ్రీన్ జోన్, సెల్ఫీ పాయింట్, బతుకమ్మ ఘాట్ తదితర సౌకర్యాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బుధవారం సాయంత్రం ప్రారంభించారు. దసరా సెలవుల నేపథ్యంలో పిల్లలు, కుటుంబ సభ్యులు సరదాగా గడిపేందుకు ట్యాంక్ బండ్‌ను అభివృద్ధి చేసినట్లు యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నగరవాసులు వాకింగ్, యోగా, వ్యాయామాలు చేసుకునేలా వాకింగ్ ట్రాక్, గ్రీన్ జోన్, పిల్లల ఆటస్థలం వంటి సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

**నగరానికి ప్రత్యేక ఆకర్షణగా ట్యాంక్ బండ్**

పెద్ద చెరువు ట్యాంక్ బండ్‌ను మరింత సుందరీకరించి మహబూబ్ నగర్ నగరానికి ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దే దిశగా ఇది తొలి దశ అభివృద్ధి కార్యక్రమమని ఎమ్మెల్యే తెలిపారు. రానున్న రోజుల్లో ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాలను దశలవారీగా అభివృద్ధి చేసి నగరవాసులు గర్వపడేలా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమానికి సహకరించిన ముడా చైర్మన్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లను ఆయన అభినందించారు.

**పరిశుభ్రత.. భద్రతపై ప్రత్యేక దృష్టి**

కొత్తగా ఏర్పాటు చేసిన సౌకర్యాలను ప్రజలు విస్తృతంగా వినియోగించుకోవడంతో పాటు వాటిని పరిశుభ్రంగా, సురక్షితంగా కాపాడుకోవాలని యెన్నం శ్రీనివాస్ రెడ్డి కోరారు. గ్రీనరీ పరిరక్షణ కోసం డ్రిప్ ఇరిగేషన్, నీటి సరఫరా వంటి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పార్కు నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించినట్లు చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా పోలీసుల గస్తీ, భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.

**మహిళా సంఘాలకు ఉపాధి అవకాశాలు:**

శిల్పారామంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు కేటాయించిన స్టాళ్లను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రారంభించారు. మహిళా సంఘాల సభ్యులు తాము తయారు చేసిన ఉత్పత్తులను స్టాళ్లలో ప్రదర్శించి విక్రయించడం ద్వారా వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని ఆమె సూచించారు. స్థానికంగా తయారయ్యే ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడం ద్వారా మహిళలు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మేయర్ జి. మమత, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, డీఆర్‌డీఓ నర్సింహులు, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు అధిక ఆదాయం వచ్చేలా కార్యాచరణ

మొదటిపేజీ తరువాయి

**వర్షాభావంతో పంటలపై ప్రభావం:**

జిల్లాలో 31 శాతం వర్షపాతం లోటు నమోదైందని వ్యవసాయ శాఖ అధికారులు వివరించారు. 11 మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్‌లో వరి సాగు విస్తీర్ణం తగ్గినట్లు అధికారులు వివరించారు. ఈ ఖరీఫ్‌లో సుమారు 1.45 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగినట్లు తెలిపారు. వర్షపాతం లోటు కారణంగా రైతులను ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగయ్యే పంటలు, ఉద్యాన పంటల వైపు ప్రోత్సహించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్ వివరించారు.

**వరి కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు:**

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సురేంద్ర మోహన్ అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు స్పష్టమైన సమాచారం అందేలా బ్యానర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించిన ఏడు సన్న రకాల ధాన్యాలను గుర్తించేలా అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఇందుకోసం వ్యవసాయ డిప్లొమా, బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్హత కలిగిన వారిని అవసరమైన చోట నియమించుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు తెలిపారు.

**'పాలమూరు బ్రాండ్'గా రైతు ఉత్పత్తి సంఘాలు:**

జిల్లా హైదరాబాద్‌కు సమీపంలో ఉన్నందున ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శి సూచించారు. వ్యవసాయ, సహకార శాఖల ఆధ్వర్యంలో జిల్లాలోని 17 రైతు ఉత్పత్తి సంఘాలను సమన్వయం చేసి, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, ఎగుమతుల ద్వారా రైతులకు అధిక ఆదాయం వచ్చేలా ప్రణాళిక రూపొందించాలని అన్నారు. మహిళా సంఘాలు 'బెనీషా' బ్రాండ్‌తో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న తరహాలోనే రైతు ఉత్పత్తి సంఘాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి 'పాలమూరు బ్రాండ్'తో వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని సూచించారు. రైతు ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేందుకు బయ్యర్స్, సెల్లర్స్ సమావేశాలు నిర్వహించాలని, హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీలతో ఎఫ్ పి ఓ లను అనుసంధానం చేసి శిక్షణ, మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలని చెప్పారు. ఎఫ్ పి ఓలు కొనుగోలు ప్రణాళికతో డీపీఆర్‌లు సిద్ధం చేస్తే ఎన్ సి డి సి ద్వారా రూ.2 కోట్ల వరకు రుణ సదుపాయం పొందే అవకాశం ఉందని తెలిపారు.

**ఉద్యాన పంటల వైపు రైతులు:**

జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం 656 ఎకరాల నుంచి 3,160 ఎకరాలకు పెరిగిందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి వేణుగోపాల్ వివరించారు. వరి, పత్తి సాగుతో పోలిస్తే ఉద్యాన పంటల ద్వారా రైతులు అధిక ఆదాయం పొందే అవకాశాలను వినియోగించుకుంటున్నారని తెలిపారు. మార్కెట్‌లో ప్రభుత్వం ప్రకటించే కనీస మద్దతు ధర, బోనస్ కంటే ఎక్కువ ధర లభించే అవకాశాలను గుర్తించి రైతులకు ఆ ప్రయోజనం చేరేలా చర్యలు తీసుకోవాలని సురేంద్ర మోహన్ సూచించారు.

**ఫార్మర్ ఐడీ పూర్తి చేయాలి:**

కేంద్ర ప్రభుత్వం రైతులకు అందించే సబ్సిడీ పథకాలు, ఎరువుల సరఫరా తదితర ప్రయోజనాలకు ఫార్మర్ ఐడీను తప్పనిసరి చేసినందున జిల్లాలో అర్హులైన రైతుల ఫార్మర్ ఐడీల నమోదును త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం:**

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుతో పాటు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కార్యదర్శి సూచించారు. భవిష్యత్తులో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు వినియోగదారుల నుంచి డిమాండ్ పెరిగే అవకాశం ఉందని తెలిపారు. బయో రిసోర్స్ సెంటర్లను చురుగ్గా పనిచేసేలా చూడాలని, ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి ఆరోగ్యం, సారవంతతను మెరుగుపరచవచ్చని అన్నారు. పంట మార్పిడి, సెరికల్చర్, హార్టికల్చర్, కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు. చిన్న, సన్నకారు, పేద రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. "రైతుకు ఏ మార్గంలో ఎక్కువ ఆదాయం వస్తుందో గుర్తించి, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి.

# జమీర్ పాషాను సన్మానించిన ఎంపీడీకే అరుణ

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా జమీర్ పాషా మాట్లాడుతూ నన్ను నమ్ముకుని పార్టీ జిల్లా మైనార్టీ బాధ్యతలు ఇచ్చినందుకు పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ,రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రతంగ పాండు రెడ్డి,రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు జగన్మోహన్ సింగ్ జి,మాజీ జిల్లా అధ్యక్షులు పడకుల శ్రీనివాస్,జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్,రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు మహబూబలి ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పోశాల్ వినోద్,మున్సిపల్ చైర్ పర్సన్ కొండ శ్వేత సత్య యాదవ్,వైస్ చైర్ పర్సన్ జి ఆర్ మంజులా రెడ్డి,ఓ బి సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘు రామయ్య గౌడ్,బిజెపి సీనియర్ నాయకులు కొండయ్య,జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ శ్యాంసుందర్ గౌడ్ తదితర బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరోగ్యమైన జీవనానికి నాణ్యకరమైన పోషకాహారం అవసరం. సిడిపిఓ

మొదటిపేజీ తరువాయి

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపీడీవో సుర్ద ఆదర్శ్, సీడీపీఓ షేక్ సన్నిహేర, సూపర్వైజర్ సోనీ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతిరోజూ అందుబాటులో ఉన్న ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు తదితర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను సమతుల ఆహారంలో భాగంగా తీసుకోవాలని తెలిపారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని వివరించారు. ఈ సందర్భంగా శ్రీమంతాలు, అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన సమతుల ఆహారం, చిన్నారుల పోషణ, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వద్దేమాన్ బిచ్చన్న, ఉప సర్పంచ్ సుదర్శన్ రెడ్డి,సూపర్వైజర్ సోనీ, ఏఎన్ఎం, వార్డు సభ్యులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు ఖాజా భాను, బి గోవిందమ్మ,ఎల్ అరుణ,కే గోవిందమ్మ,ఆశ వర్కర్స్ మరియు తల్లులు, గర్భిణీలు, కిషోర్ బాలికలు .పెద్ద ఎత్తున తదితరులు పాల్గొన్నారు

# ఖాన్ అకాడమీ,ఫిజిక్స్ వాలా ఆన్‌లైన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

## - కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

### - సాంకేతికతతో బోధన నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి



**గద్వాల అక్టోబర్ 06(ప్రజా జ్యోతి ప్రతినిధి):**



మారుతున్న కాలానుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధన నైపుణ్యాలను మెరుగుపరచుకుంటూ సాంకేతికతపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్ కెరీర్‌కు ఉపయోగపడేలా బోధన సాగించాలని సూచించారు.జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న'జ్ఞాన దీప్తి'కార్యక్రమంలో భాగంగా గోనుపాడు గ్రామంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గణిత ఉపాధ్యాయులకు వారం రోజులుగా నిర్వహిస్తున్న డిజిటల్ లెర్నింగ్ వర్క్‌షాప్‌లో బుధవారం కలెక్టర్ పాల్గొని మాట్లాడారు.గణితం,సైన్స్ సబ్జెక్టులకు ఎంతో ప్రాధాన్యం ఉన్నందున సృజనాత్మకతతో సాంకేతికతను వినియోగించి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు.ప్రస్తుతం డిమాండ్ ఉన్న ఉద్యోగాలు,వృత్తులను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల్లో అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేలా బోధన సాగించాలని,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతలను కూడా వినియోగించుకోవాలని అన్నారు.ఖాన్ అకాడమీ,ఫిజిక్స్ వాలా,ఎఫ్ఎల్ఎన్ఏఎక్స్ వంటి ఆన్‌లైన్ తరగతులను ఉపాధ్యాయులు,విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఐఐటీ,నీట్ వంటి ప్రతిష్టాత్మక ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఆన్‌లైన్ తరగతులను వినియోగించుకుని ప్రతిభ చాటుతున్నారని పేర్కొన్నారు.పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులందరూ ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని,వంద శాతం ఫలితాలు సాధించే లక్ష్యంతో బోధన సాగించాలని కలెక్టర్ ఆదేశించారు.ముఖ్యమైన పాఠ్యాంశాలతో పాటు గత ప్రశ్నపత్రాలను క్షుణ్ణంగా సాధన చేసేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు.గట్టు,కేటీ దొడ్డి వంటి వెనుకబడిన మండలాల్లోనూ ఇటీవల విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారని,ఇదే స్ఫూర్తితో ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు.శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని వాటిలో నేర్చుకున్న అంశాలను తమ పాఠశాలల్లో అమలు చేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి,శిక్షకులు నరేష్,రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు

## - ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

## - విద్యార్థులు తిరగబడితే ప్రభుత్వం గంట కూడా నడవదు: మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్/మహబూబ్ నగర్ అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి బ్యూరో):**

రాష్ట్రవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ మంత్రి విరసనోళ్ళ శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ నిర్వహించిన ధర్నాలో ఆయన, విశారదన్ మహారాజ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 14 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బకాయిలు చెల్లించకపోవడంతో కొన్ని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, ఫలితంగా పై చదువులకు వెళ్లేందుకు, ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజులను విడుదల చేయకుండా విద్యార్థులే చెల్లించాలని చెప్పడం పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం మోపడమేనని ఆయన అన్నారు. భారీ మొత్తాల్లో ఫీజులు చెల్లించే స్థోమత లేని కుటుంబాలు ఏం చేయాలని ప్రశ్నించారు.

**కళాశాలలపై ఒత్తిడి ఎందుకు.?**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం కళాశాలల యాజమాన్యాలు ఆందోళనలకు సిద్ధమవుతున్న సమయంలో విజిలెన్స్ దాడుల పేరుతో వారిపై ఒత్తిడి తీసుకురావడం సరికాదని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. భవనాలు, నీటి సౌకర్యం, విద్యుత్, అనుమతులు, మౌలిక వసతులు వంటి అంశాలను చూపుతూ కళాశాలలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.ప్రైవేట్ భవనాల్లో కళాశాలలు నిర్వహిస్తున్న యాజమాన్యాలు అద్దెలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నాయని, సిబ్బందికి జీతాలు ఇవ్వలేకపోతున్నారని, కొన్ని కళాశాలలు బస్సులకు డీజిల్ పోయించలేని స్థితికి చేరుకున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం విడతల వారీగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ బకాయిలపైనా ఆందోళన:**

పేదలకు వైద్య సేవలు అందించే ఆరోగ్యశ్రీ, రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య సేవలు అందించే ఈహెచ్ఎస్ వంటి పథకాలలోనూ బకాయిల చెల్లింపుల అంశం సమస్యగా మారిందని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆస్పత్రులకు



బకాయిలు చెల్లించకుండా ఒత్తిడి తీసుకురావడం, కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు.విద్యార్థులు తమ హక్కుల కోసం ఆందోళన చేస్తే కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయడం పరిష్కారం కాదని అన్నారు. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు.

**రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వాలి:**

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు, రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేయాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే వారి హక్కుల కోసం విస్తృత స్థాయిలో ఉద్యమించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆయన హెచ్చరించారు. విద్యార్థులు, నిరుద్యోగులు, అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం కలిసి పోరాటం చేస్తామని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.

# భూముల హద్దులు ఇక పక్కాగా!

## - అమ్మపల్లిలో రీసర్వేపై అవగాహన సదస్సు
## - ఆధునిక రోవర్ సాంకేతికతతో భూముల కొలతలు
## అదనపు కలెక్టర్ హరిప్రియ

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి బ్యూరో):**




భూముల హద్దులు, రెవెన్యూ రికార్డులకు సంబంధించి భవిష్యత్తులో వివాదాలు తలెత్తకుండా జిల్లాలో చేపడుతున్న భూముల రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ తెలిపారు. జడ్చర్ల మండలం అమ్మపల్లి గ్రామంలో చేపట్టనున్న భూముల రీసర్వేపై నిర్వహించిన గ్రామసభ, అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు రీసర్వే ప్రక్రియ, దాని ప్రయోజనాలపై అధికారులు వివరించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో భూముల రీసర్వే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఆధునిక రోవర్ సర్వే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భూములను ఖచ్చితంగా కొలవడంతో పాటు, ఆయా భూముల హద్దులను స్పష్టంగా నిర్ధారించడం జరుగుతుందని వివరించారు.

**భూయజమానులకు ఎల్ పి ఎం లు**

రీసర్వే పూర్తయిన అనంతరం భూముల హద్దులను స్పష్టంగా గుర్తించి, సంబంధిత భూయజమానులకు ల్యాండ్ పార్సెల్ మ్యాప్స్ అందజేయనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. భూముల వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా రికార్డులను మరింత స్పష్టంగా రూపొందించేందుకు ఈ ప్రక్రియ దోహదపడుతుందని పేర్కొన్నారు. భూముల హద్దులు, రెవెన్యూ రికార్డులకు సంబంధించి భవిష్యత్తులో వివాదాలు తలెత్తకుండా రీసర్వే ప్రక్రియను సమగ్రంగా, పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

**అధికారులకు సహకరించాలి:**

రీసర్వే కార్యక్రమం సజావుగా, సమర్థవంతంగా పూర్తయ్యేందుకు గ్రామస్థులు అధికారులకు పూర్తి సహకారం అందించాలని అదనపు కలెక్టర్ హరిప్రియ విజ్ఞప్తి చేశారు. భూములకు సంబంధించిన వివరాలు, హద్దుల గుర్తింపు తదితర అంశాల్లో ప్రజలు అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీ ఎస్ఎల్ఆర్, జడ్చర్ల తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్, రెవెన్యూ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్‌డోన్ రైల్వే మార్గం విస్తరణకు భూసేకరణ దాదాపు పూర్తి

## - మిగిలిన భూసేకరణను త్వరలోనే పూర్తిచేస్తాం :
## కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 7 ( ప్రజా జ్యోతి బ్యూరో):**

తెలంగాణలో అమలవుతున్న ప్రగతి, ప్రధానమంత్రి గతిశక్తి ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ అంశాలపై బుధవారం ఢిల్లీ నుంచి కేంద్ర మంత్రివర్గ సచివాలయ సమన్వయ కార్యదర్శి మనోజ్ గోవిల్ అధ్యక్షతన వీడియో సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ నుంచి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొనగా, మహబూబ్‌నగర్ జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో సమావేశ మందిరం నుంచి పాల్గొన్నారు.సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో రాష్ట్రంలో కొనసాగుతున్న నీటిపారుదల, రైల్వే ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించి, ప్రాజెక్టులను నిర్ణీత సమయంలో ముందుకు తీసుకెళ్లే అంశాలపై చర్చించారు.

**రైల్వే మార్గం విస్తరణపై ప్రత్యేక సమీక్ష**




సమావేశంలో మహబూబ్‌నగర్‌డోన్ రైల్వే మార్గం రెండవ మార్గం నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ పురోగతిపై జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా వివరాలు వెల్లడించారు. రైల్వే మార్గం రెండవ మార్గం నిర్మాణానికి అవసరమైన భూసేకరణ దాదాపుగా పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. స్వల్పంగా మిగిలి ఉన్న భూసేకరణ ప్రక్రియను కూడా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని త్వరలోనే పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ అంశాల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు. ఈ వీడియో సమావేశంలో ఆర్‌డీఓ నవీన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మహిళా మోర్చా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలుగా

## - ప్యాట లలితమ్మ ఎన్నిక
## - హర్షం వ్యక్తపరిచిన నర్వ మండల బిజెపి నాయకులు

**నర్వ అక్టోబర్ 7 ప్రజా జ్యోతి**



బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పేట లలిత వెంకటరెడ్డి నియామకం పై నర్వ మండల బిజెపి కార్యకర్తలు నాయకులు వర్షం వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా పేట లలితమ్మ మాట్లాడుతూ నన్ను భారతీయ జనతా పార్టీలో రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలుగా. ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి డీకే అరుణమ్మ గారికి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి గారికి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి శిల్పా రెడ్డి గారికి నారాయణ పేట జిల్లా అధ్యక్షులు సత్యా యాదవ్ గారికి మరియు నర్వ మండల బీజేపీ కుటుంబ సభ్యులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన మీ అందరి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీ బలోపేతానికి మరియు ప్రజా సేవకు నా శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇస్తున్నాను అని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.



# కొల్పూర్ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి శ్రీహరి

**మాగనూరు, ప్రజా జ్యోతి (అక్టోబర్ 07)**

కొల్పూర్ గ్రామ సర్పంచ్ ముద్ద రాములు ఇటీవల మృతి చెందడంతో మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి బుధవారం ఆయన స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముద్ద రాములు మృతికి సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.





# సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

## - పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, ఆన్‌లైన్ షాపింగ్ పేరుతో మోసాలపై జాగ్రత్త

## - మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి : పోలీసు అధికారులు

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి బ్యూరో):**

డిజిటల్ యుగంలో సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే అనుమానాస్పద సందేశాలు, లింక్‌లను తెరవడం, వ్యక్తిగత బ్యాంకు వివరాలను ఇతరులతో పంచుకోవడం ద్వారా సైబర్ నేరగాళ్ల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.తెలంగాణ రాష్ట్ర సైబర్ భద్రతా విభాగం డైరెక్టర్ శిఖా గోయల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ సూచనలతో సైబర్ అవగాహన దినోత్సవంలో భాగంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎన్‌టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సైబర్ నేరాల విభాగం డీఎస్పీ గిరి కుమార్ పాల్గొని విద్యార్థులకు వివిధ రకాల సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు.

**పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో మోసాలు:**

డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు అనేక రూపాల్లో జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ఆన్‌లైన్ మోసాలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో మోసాలు, నకిలీ ఉద్యోగాల పేరుతో మోసాలు, వ్యక్తులుగా నటించి మోసాలకు పాల్పడటం, ఫోన్ కాల్స్, సందేశాల ద్వారా మోసాలు వంటి వాటిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింక్‌లను తెరవకూడదని, ఒక్కసారి ఉపయోగించే సంకేత సంఖ్య, రహస్య సంఖ్య, కార్డు వెనుక ఉన్న భద్రతా సంఖ్య, బ్యాంకు ఖాతా వివరాలు, సంకేతపదాలు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి




పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు.

**కొత్త పద్ధతులతో సైబర్ నేరాలు:**

సైబర్ నేరాల విభాగం డీఎస్పీ గిరి కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ప్రజలను నమ్మించి వారి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు దోచుకునేందుకు రోజురోజుకూ కొత్త పద్ధతులను ఉపయోగిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు, వ్యక్తులుగా నటించి చేసే మోసాలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో మోసాలు తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ నేరాల సహాయవాణికి సమాచారం అందించాలని సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు.

**చిత్ర ప్రదర్శన ద్వారా అవగాహన:**



విద్యార్థులకు చిత్ర ప్రదర్శన ద్వారా వివిధ రకాల సైబర్ నేరాలు, నేరగాళ్లు అనుసరించే విధానాలు, మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించే పోస్టర్లను ప్రదర్శించారు.విద్యార్థులతో సైబర్ నేరాల నివారణకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. తాము అప్రమత్తంగా ఉండటంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలోని ఇతరులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైబర్ నేరాల విభాగం ఉపపరిశీలకుడు శ్రావణ్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, సైబర్ నేరాల విభాగం సిబ్బంది పాల్గొన్నారు. సుమారు 300 మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని సైబర్ నేరాల నివారణపై అవగాహన పొందారు. "అప్రమత్తతే సైబర్ నేరాల నుంచి రక్షణ.. మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయండి" అని పోలీసు అధికారులు విద్యార్థులకు సూచించారు.

# గద్వాలలో ఆర్టీసీ ఐక్య కూటమి హోరాహోరీ ప్రచారం

**ఆలంపూర్ అక్టోబర్ 7(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

గద్వాల డిపోలో ఎంప్లాయిస్ యూనియన్, తెలంగాణ మజ్దూర్ యూనియన్ సభ నిర్వహించడం జరిగింది, ఈనెల 9 వ తారీకు జరగబోయే ఎలక్షన్ ఉద్దేశించి జరపడం జరిగినది. ప్రస్తుతము చాలా సంవత్సరాల తర్వాత ఆర్టీసీలో యూనియన్ ఎలక్షన్లు రావడం అందులో కార్మికులు చైతన్యంగా పాల్గొనడం చాలా శుభ పరిణామం.ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆర్టీసీలో యూనియన్లు రద్దు అయినప్పటి నుండి కూడా ఏమాత్రం విశ్రమించకుండా కార్మికుల తరపున పోరాటాలు చేస్తూ వారి సమస్యలు పరిష్కారం కొరకు యాజమాన్యానికి మరియు ప్రభుత్వానికి ఎన్నో నివేదికలు సమర్పిస్తూ కార్మికుల తరఫున పోరాటాలు ఏనాడు ఆపలేదు. దానిఫలంగా ఆర్టీసీ జేఏసీ ఐక్య కార్యాచరణ రూపొందించి చాలా యూనియన్లను అందులో కలుపుకొని ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చి గత నెల ఏప్రిల్ లో సమ్మెకు వెళ్లడం అందులో సమ్మెను సక్సెస్ చేయడము మరియు 32 డిమాండ్లను సాధించుకోవడం జరిగింది. ముఖ్యంగా ఆ డిమాండ్లలో ప్రభుత్వ విలీనం అనేటువంటిది చాలా ప్రధానమైన డిమాండ్. ప్రభుత్వ విలీనము జరగాలంటే ఆర్టీసీలు ఎలక్షన్లు జరగాలి, అందులో గెలిచినటువంటి అధికార యూనియన్ కు ప్రభుత్వ విలీన ప్రక్రియలో భాగస్వామ్యం ఇవ్వాలి అనేటువంటిది చట్టం కాబట్టి ప్రభుత్వము ప్రస్తుతము ఆర్టీసీలో యూనియన్ ఎలక్షన్లకు అనుమతి ఇవ్వడము ఎలక్షన్లకు కార్మికులు సమయుక్తము అవడం జరుగుతున్నది, ప్రస్తుతము ఆర్టీసీలో జరుగుతున్నటువంటి యూనియన్ ఎలక్షన్లు అధికారానికి, ఆత్మ గౌరవానికి జరిగేటువంటి ఒక యుద్ధము,ఎందుకంటే ప్రస్తుత ప్రజా ప్రభుత్వము కొన్ని యూనియన్లకు తనే మద్దతు తెలుపుతూ సమర్థించడం చాలా బాధాకరం. ఆర్టీసీలో గత ఆరు సంవత్సరాల క్రితం యూనియన్లు రద్దు అయిన తర్వాత కార్మికులు ఎన్నో వేదనలకు గురికావడం ఇచ్చిన



కిలోమీటర్ల భారము తట్టుకోలేక అసువులు బాసిన ఎందరో కార్మికులు అమరులయ్యారు, మరి ఆర్టీసీలో యూనియన్ లేకపోవడం వలన వారి సమస్యలు పరిష్కారం కాక అధికారుల వేధింపులకు గురి అవుతూ తమ ఆత్మగౌరవాన్ని కోల్పోతూ ఎంతో అవమానాలు పడుతూ పెరిగిన కిలోమీటర్ల భారంతో అనారోగ్యాల పాలు అయినారు. మరి ఈరోజు ప్రజా ప్రభుత్వం వారి సమస్యలను గుర్తించి వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించకుండా ఒకే ఒక యూనియన్ కు మద్దతు తెలుపుతూ యూనియన్ ఎలక్షన్లకు వెనుక నుండి ప్రోత్సాహం అందించడం చాలా బాధాకరంగా కనిపిస్తుంది. కానీ ఎంప్లాయిస్ యూనియన్ మాత్రమే ఈనాడు విశ్రమించకుండా ఎన్నో పోరాటాలు చేస్తూ కార్మికుల సమస్యలను పరిష్కార దిశ వైపు తీసుకెళ్లి సమ్మె నోటీస్ ఇచ్చి సమ్మెను విజయవంతం చేసి 32 డిమాండ్లను సాధించడం ఇది కార్మికులకు అందరికీ తెలుసు, అదేవిధంగా ఎంప్లాయిస్ యూనియన్ ఆర్టీసీ కార్మికుల యొక్క ఆత్మ గౌరవాన్ని కాపాడుతూ వారి సమస్యలను పరిష్కారం చేసేటట్టు అడుగులు వేస్తుంది. మరి ఈరోజు అధికార ప్రభుత్వము ఒక యూనియన్ కి మద్దతు తెలపడం వలన కార్మికుల ఆత్మగౌరవం దెబ్బతిన్నది కాబట్టి, ఈరోజు ఆర్టీసీలో జరిగేటువంటి యూనియన్ ఎలక్షన్లు అధికారానికి ఆత్మ గౌరవానికి జరిగేటువంటి యుద్ధముగా మారింది, కావున ప్రతి కార్మికుడు తనకున్న బాధలు, కష్టాలు, అమరులైన తన తోటి



ఉద్యోగులను గుర్తు చేసుకుంటూ ఆర్టీసీ ఎలక్షన్లలో నిజాయితీగా కష్టపడినటువంటి తమకోసం ఏనాడూ కూడా విశ్రమించకుండా పోరాటం చేసినటువంటి ఎంప్లాయిస్ యూనియన్, ఐక్య కూటమి గెలుపునకు నాంది పలకాలని ఇంతవరకు వారి యొక్క ఆత్మ గౌరవాన్ని కాపాడినటువంటి యూనియన్ కే తమ ఓటును వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి విజయోత్సవ దుందుభిని మోగించాలని కోరుకుంటూ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఐక్య కూటమి గద్వాల డిపోలో సభను నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.టి.యు.సి జిల్లా అధ్యక్షులు సిపిఐ పార్టీ కార్యదర్శి ఆంజనేయులు, ఏ.ఐ.టి.యు.సి జిల్లా కార్యదర్శి రంగన్న, ఆటో యూనియన్ అధ్యక్షులు వెంకటేష్, ట్రెజరర్ ఆశన్న, ఎస్సీ ఎస్టీ రీజినల్ కార్యదర్శి సురేష్, డిపో ఎస్సీ ఎస్టీ అధ్యక్షులు సురేష్ వీర, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు పరమేశ్వరయ్య, గద్వాల డిపో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు గాలి రెడ్డి, కార్యదర్శి గిరిరాజు, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి బసన్న, మహబూబ్నగర్ ఎంప్లాయిస్ యూనియన్ రీజియన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాంనాథ్, సహాయ కార్యదర్శి కవిత, శ్రీధర్ రావు , భాస్కర్ , డి ఆర్ రెడ్డి అలంపూర్ వెంకటేష్ , పృధ్వీరాజ్ ,నాగరాజు, సరస్వతి, రాజ్యలక్ష్మీ, వరలక్ష్మి, రాధా, శ్యామల, అనిత, ఇందిరా మొదలగు మహిళా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను దిగ్విజయము చేయడం జరిగినది.

## కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ పెబ్బేరు మండల అధ్యక్షుడిగా దారపోగు వెంకటేష్

పెబ్బేరు అక్టోబర్07 ప్రజాజ్యోతి

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ పెబ్బేరు మండల అధ్యక్షుడిగా మండల పరిధిలోని రంగాపురం గ్రామానికి చెందిన దారపోగు వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో, వనపర్తి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శివసేన రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు రాజ్ కుమార్, నియామక పత్రాన్ని అందజేసి శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా నూతన ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దారపోగు వెంకటేష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి, ఎస్సీ సెల్ మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు రాజ్ కుమార్ కు,ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు."పార్టీ నాపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను" అని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని గుర్తించి గౌరవించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.



# బునియాదిపురంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

పెబ్బేరు అక్టోబర్07 ప్రజాజ్యోతి

ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందించడమే లక్ష్యం బునియాదిపురం గ్రామపంచాయతీలో ఈరోజు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది.గ్రామ సర్పంచ్ వజగౌని విజయ్ గౌడ్ చేతుల మీదుగా గ్రామంలోని అర్హులైన కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.గ్రామంలోని ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందేలా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు రేషన్ సరుకులు మరియు ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా అందు బాటులోకి వస్తాయని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వజగౌని విజయ్ గౌడ్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా గ్రామపంచాయతీ తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను గ్రామస్థాయిలోనే అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు గ్రామ వార్డు సభ్యులు వనం సాహదేవుడు, అలీమామాబు, భరత్, మారమోని రమేష్,



తదితరులు పాల్గొన్నారు.అలాగే బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వనం రాములు, మండల కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, సాగర్, మల్లేష్ యాదవ్ తదితర నాయకులు పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

### గ్రామ ప్రజల భాగస్వామ్యం

లబ్ధిదారులు ఈశ్వరమ్మ, పద్మ, జానకమ్మ, పెద్దరాముడు, చిన్నదాసు, చిన్న రాముడు, కోరే రఘు, నాగరాజు, శ్యాము, బొగుల సురేష్, శివరాజు, నాగన్న గోవిందు, బునియాదిపురం వీఆర్వో దేవన్న, రేషన్ డీలర్ ఎల్లస్వామి మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య పెంచాలి... - వనపర్తి జిల్లా వైద్యాధికారి డా.భాస్కర్.

పెబ్బేరు అక్టోబర్07 ప్రజాజ్యోతి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య పెంచాలని వనపర్తి జిల్లా వైద్యాధికారి డా.భాస్కర్ చెప్పారు. బుధవారం ఆయన పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జనరల్ ఓపి రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్, ఇన్ పేషెంట్ రిజిస్టర్, హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు.వైద్యశాలలో ఉన్న గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులైన మలేరియా,డెంగ్యూ,చికెన్ గున్యా, రాకుండా ప్రతి మంగళ వారం, శుక్రవారాల్లో అందరూ డ్రై డే కార్యక్రమం నిర్వహించాలనీ వైద్య సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డా.నదియా సదత్, పల్లె దవాఖాన డాక్టర్ వినీల, హెచ్ఇవో నర్సింగ్ రావు, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, ఫార్మసిస్ట్ కుమారి, స్టాఫ్ నర్సు లక్ష్మీ, డీఈవో రాజేష్ గౌడ్, ల్యాబ్ టెక్నీషియన్ విక్టర్ రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# పెబ్బేరు భూముల పరిరక్షణపై తీన్మార్ మల్లన్నకు వినతిపత్రం

## -10 శాతం మున్సిపల్ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని వడ్డె రమేష్ విజ్ఞప్తి.

పెబ్బేరు అక్టోబర్07 ప్రజాజ్యోతి

బీజ రాజ్యాధికార యాత్రలో భాగంగా పెబ్బేరుకు వచ్చిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌ని ను వడ్డె రమేష్ కలిశారు. ఈ సందర్భంగా పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో ప్రజా అవసరాల కోసం కేటాయించిన భూములకు సంబంధించిన సమస్యపై వినతిపత్రం అందజేశారు.పెబ్బేరు పట్టణంలో కోట్లది రూపాయల విలువైన భూములు ఉన్నాయని, వాటిలో మున్సిపల్ మరియు ప్రజా అవసరాల కోసం భవిష్యత్ తరాలకు ఉపయోగపడాల్సిన భూములు ఆక్రమణలకు గురవుతున్నాయనే అంశాన్ని వడ్డె రమేష్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న దృష్టికి తీసుకెళ్లారు.ముఖ్యంగా ఈ మధ్య కాలం లో సంత బజారు లో స్నేహ చికెన్ సెంటర్ వెనకాల ఉన్న 10 శాతం భూమి ఈ ప్రజా పాలనలో కబ్జా కు గురైందని తెలియజేసారు. 10 శాతం మున్సిపల్ / ప్రజా అవసరాల భూమిగా ఉండాల్సిన స్థలాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని, వాటి స్థితిగతులపై సమగ్ర విచారణ జరిపించి, నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమణలు జరిగి ఉంటే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజా అవసరాల కోసం ఉద్దేశించిన భూములు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వడ్డె రమేష్ విజ్ఞప్తి చేశారు. భూముల రికార్డులను పరిశీలించి, ప్రభుత్వ మరియు మున్సిపల్ భూముల హద్దులను స్పష్టంగా గుర్తించి, వాటిని పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్పందిస్తూ, వడ్డె రమేష్ అందజేసిన వినతిపత్రంలోని అంశాలను పరిశీలించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వడ్డె రమేష్ తెలిపారు.ప్రజా అవసరాల కోసం కేటాయించిన భూముల పరిరక్షణ విషయంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించి, భవిష్యత్ తరాలకు ఆ భూములు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వడ్డె రమేష్ కోరారు.



# ఆగండి... ఆలోచించండి... అడుగు వేయండి!

## - అత్యాశే మోసగాడి ఆయుధం  అప్రమత్తతే మీ కవచం

## - ఒక్క వ్యక్తి అప్రమత్తత ఒక్క కుటుంబాన్ని కాపాడితే... ఒక్క కుటుంబం అప్రమత్తత ఒక్క గ్రామాన్ని కాపాడుతుంది

## - సైబర్ నేరాలపై పోరాటం ప్రజా ఉద్యమంగా మారాలి

## : సైబర్ మోసాలపై అవగాహన పోస్టర్లను విడుదల చేసిన ఎస్పీ టి. శ్రీనివాసరావు ఐపీఎస్

**ఆలంపూర్ అక్టోబర్ 7(ప్రజా జ్యోతి డివిజన్ ప్రెసిడెంట్)**

ప్రజల అత్యాశ, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళు మోసాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, “ఆగండి.. ఆలోచించండి.. ఆ తర్వాతే అడుగు వేయండి” అనే జాగ్రత్తను ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్ సూచించారు. ఒక్క వ్యక్తి అప్రమత్తత ఒక కుటుంబాన్ని కాపాడుతుందని, ప్రతి కుటుంబం అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాలను సమర్థవంతంగా అడ్డుకోవచ్చని పేర్కొన్నారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో మార్గదర్శకాల మేరకు సైబర్ జాగృక్త దివాస్ లో భాగముగా అక్టోబర్ నెలను సైబర్ సెక్యూరిటీ అవేర్నెస్ మంత్‌గా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సైబర్ మోసాల నివారణ ప్రజా ఉద్యమంగా మారాలని పిలుపునిస్తూ, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సైబర్ మోసాలపై అవగాహన పోస్టర్లను ఎస్పీ విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. తక్కువ పెట్టుబడికి అధిక లాభాలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, లోన్ యాప్‌లు, ఆన్‌లైన్ షాపింగ్ ఆఫర్లు, లాటరీలు, అధికారుల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్ వంటి వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా ఓటిపి, ఏటీఎం, పిన్, యూ.పి.ఐ. పిన్, పాస్‌వర్డ్‌లు, బ్యాంకింగ్ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని, గుర్తుతెలియని లింకులపై క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. అలాగే ఆగండి.. ఆలోచించండి.. ఆ తర్వాతే అడుగు వేయండి అనే జాగ్రత్తను ప్రతి ఒక్కరూ పాటించాలని, ఏదైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930కు ఫోన్ చేసి, ఎఎవతీఎతీఅఎవ.ద్రశీజ.అఅలో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచిం చారు. సకాలంలో సమాచారం అందిస్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా.అక్టోబర్ నెలంతా పాఠశాలలు, కళాశాలలు, మార్కెట్లు, బస్‌స్టాండ్లు, ప్రజలు అధికంగా ఉండే ప్రాంతాల్లో సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. సైబర్ నేరాల నివారణ కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉండి కుటుంబ సభ్యులు, స్నేహితులు, చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు.




# దసరా సెలవుల్లో ప్రైవేట్ పాఠశాలలు నిర్వహించరాదు

## నిబంధనలు ఉల్లంఘిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవు:

## - ఎంఈఓ బి. రాములు

**అయిజ అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

అయిజ మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులతో మండల విద్యాధికారి బి. రాములు బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎం.ఈ.ఓ బి. రాములు మాట్లాడుతూ, దసరా సెలవుల సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠశాలలను నిర్వహించరాదని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాలు, విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘించి సెలవుల్లో పాఠశాలలు నిర్వహించే యాజమాన్యాలపై ఉన్నతాధికారులకు నివేదించి, నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకునేలా సిఫారసు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా దసరా సెలవులను సద్వినియోగం చేసుకుని పాఠశాలలకు సంబంధించిన పెర్ఫార్మెన్స్ గ్రేడ్ లేండెక్స్ పి.జి.ఎల్ యు. డి .ఎల్ .ఎస్ .ఈ లో పెండింగ్ పనులు, విద్యార్థుల వివరాల సమీకరణ తదితర అంశాలను పూర్తి చేసి, జిల్లాలో అయిజ మండలాన్ని ముందంజలో నిలిపేందుకు ప్రతి పాఠశాల యాజమాన్యం సహకరించాలని కోరారు. అదేవిధంగా విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ నిబంధనలను ప్రతి ప్రైవేట్ పాఠశాల తప్పనిసరిగా పాటించాలని ఎంఈఓ సూచించారు.ఈ సమావేశంలో ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎం ఎల్. ఎస్ .కోఆర్డినేటర్ ఆర్. ఉదయ్ కిరణ్, సి .ఆర్. పి తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.



# సుఖ్‌దేవ్ భగత్ రాకతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం...!

## - డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్  - ఏఐసీసీ కార్యదర్శి

**ఆలంపూర్ అక్టోబర్ 7(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**






ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ పార్టీ నూతన ఇన్‌చార్జ్, ఎంపీ సుఖ్‌దేవ్ భగత్ జీ ఛత్తీస్‌గఢ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా రాయ్‌పూర్‌లోని స్వామి వివేకానంద విమానాశ్రయంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఏఐసీసీ ఇన్‌చార్జ్ డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ ,ఆరాష్ట్ర పీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.బిఈ సంద ర్భంగా సుఖ్‌దేవ్ భగత్ జీని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ ఆత్మీయంగా అభినందించారు.ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ మాట్లాడుతూ సుఖ్‌దేవ్ భగత్ జీ ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనకు హృదయపూర్వక స్వాగతం పలికారు. ఆయన నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని, పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యలపై మరింత బలంగా పోరాటం చేస్తామని అన్నారు అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని, ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ పిలుపునిచ్చారు అలాగే సుఖ్‌దేవ్ భగత్ జీ రాకతో ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.

# గౌడ్ సాబ్ పట్టాలు ఇచ్చినా... రెడ్డి గారు తాళాలు ఇస్తలేడు..!?

## - జర్నలిస్టుల 'సొంతింటి కల'కు అధికారుల ఫుల్‌స్టాప్ ఎప్పుడు.!

## - ఇళ్లు సిద్ధం... లబ్ధిదారులు సిద్ధం... మరి పంపిణీకి అడ్డంకి ఎవరు..?

## - పాలమూరు నుంచి ప్రజాభవన్‌కు జర్నలిస్టుల పాదయాత్ర...

## - ప్రభుత్వానికి 'చెవులు తెరిపించే' దిశగా జర్నలిస్ట్ ల అడుగులు!

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి బ్యూరో):**

"ఇల్లు కట్టించి తాళం వేస్తే అది ఇల్లు కాదు... ప్రభుత్వ కార్యాలయంలో ఫైలు అయితే అది అంతులేని కథ!" జర్నలిస్టుల ఇళ్ల సమస్యను చూస్తుంటే ప్రస్తుతం ఇదే సామెత గుర్తుకు వస్తోంది. సంవత్సరాలు గడిచాయి... ప్రభుత్వాలు మారాయి... అధికారులు మారారు... పాలకులు మారారు... కానీ జర్నలిస్టుల ఇళ్ల సమస్య మాత్రం "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్న చందంగా ఉండిపోయింది.ఒకప్పుడు పట్టాలు ఇచ్చారు. ఆ తర్వాత ఇళ్ల నిర్మాణం జరిగింది. లబ్ధిదారులు కూడా సిద్ధంగా ఉన్నారు. కానీ తాళాలు మాత్రం ఎప్పుడు చేతికి వస్తాయో చెప్పేవారు లేరు!ఇది ఇల్లు పంపిణీ వ్యవహారమా? లేక "ఫైలు ఎక్కడుందో వెతుకు" అనే ప్రభుత్వ స్థాయి ఆటా? అన్న సందేహం జర్నలిస్టుల్లో వ్యక్తమవుతోంది.

### ప్రజల సమస్యలు రాసే వారికి...

### తమ సమస్య మాత్రం ఎవరు రాస్తారు.?

ప్రజలకు ఇళ్లు లేవంటే వార్త రాసేది జర్నలిస్టే. రోడ్లు బాగోలేవంటే ప్రశ్నించేది జర్నలిస్టే. అధికారులు స్పందించడం లేదంటే నిలదీసేది జర్నలిస్టే. పేదలకు న్యాయం జరగడం లేదంటే గొంతెత్తేది జర్నలిస్టే. కానీ జర్నలిస్టుల ఇళ్ల సమస్య వస్తే మాత్రం... ఫైళ్లకు 'మౌనం' ఎందుకు?ఇదే ఇప్పుడు అసలు ప్రశ్న. "అద్దంలో ముఖం కనిపించకుండా దుమ్ము ఉందని అద్దాన్నే నిందించినట్లు", ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టుల సమస్యలను కూడా సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంచడం ఎంతవరకు సమంజసం?

### 30 ఏళ్ల సేవకు 30 ఏళ్ల నిరీక్షణేనా?

మూడు దశాబ్దాలుగా జర్నలిజం వృత్తిలో ఉన్న కొంతమంది జర్నలిస్టులకు ఇప్పటికీ సొంత ఇల్లు లేకపోవడం పరిస్థితి తీవ్రతను చెబుతోంది. ఇంటి కోసం పోరాడిన జర్నలిస్టులు వృద్ధులయ్యారు...

### పిల్లలు పెద్దయ్యారు...ప్రభుత్వాలు మారాయి...

కానీ ఫైలు మాత్రం యవ్వనంగానే ఉంది! ఇంతకాలం ఒక ఫైలు కదలకపోతే దానికి చక్రాలు అవసరమా? లేక "శుభ ముహూర్తం" కోసం ఎదురుచూస్తుందా? అని జర్నలిస్టులు ప్రశ్నిస్తున్నారు.

### 'ప్రజాపాలన'లో జర్నలిస్టుల పాలిట మాత్రం ఎందుకీ నిరీక్షణ?

ప్రజాపాలన... ప్రజా సంక్షేమం... పారదర్శక పాలన... అంటూ నిత్యం ప్రసంగాలు వినిపిస్తున్నాయి. అయితే ప్రజల తరఫున ప్రశ్నించే జర్నలిస్టులు తమ ఇళ్ల కోసం ప్రశ్నిస్తే మాత్రం "ఫైలు పరిశీలనలో ఉంది", "ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం", "త్వరలో చర్యలు" అనే పాత డైలాగులే ఎందుకు?"రేపు" అనే మాటకు ప్రభుత్వ ఫైళ్లలో ఎంత పొడవైన క్యాలెండర్ ఉందో జర్నలిస్టులకు అర్థం కావడం లేదు!

### ఇళ్లు ఉన్నా... ఇళ్లలో జర్నలిస్టులు లేరు!

నిర్మాణం పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించకుండా ఉంచడం వెనుక అసలు కారణమేంటి?నిధుల సమస్యా? పరిపాలనా సమస్యా? సాంకేతిక సమస్యా?లేదా నిర్ణయం తీసుకునే చిత్తశుద్ధి సమస్యా?

### ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలి.

ఎందుకంటే "పాలు పొంగిపోతే పొయ్యి మీద పడతాయి... సమస్యలు పొంగిపోతే ప్రజల రోడ్డుపైకి వస్తారు."ఇప్పుడు జర్నలిస్టులు కూడా రోడ్డుపైకి వస్తున్నారు.

### పాలమూరు నుంచి ప్రజాభవన్‌కు... అడుగులు కాదు, ప్రశ్నలు.!

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్  రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అక్టోబర్ 10న చేపట్టనున్న "పాలమూరు టు ప్రజాభవన్" పాదయాత్ర కేవలం కొన్ని కిలోమీటర్ల ప్రయాణం కాదు.అది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రశ్నలకు సమాధానం కోరే ప్రయాణం. "పట్టాలు ఇచ్చిన ప్రభుత్వం... తాళాలు ఎప్పుడు ఇస్తుంది?" "ఇళ్లు నిర్మించిన అధికారులు... పంపిణీ చేయడానికి ఎందుకు వెనుకడుగు వేస్తున్నారు..?""ఏళ్లుగా సేవ చేస్తున్న జర్నలిస్టులకు సొంతింటి హక్కు ఎప్పుడు లభిస్తుంది?" ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది ఇప్పుడు ప్రభుత్వమే.ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో, అక్టోబర్ 10న పాలమూరు నుంచి బయలుదేరే ప్రతి



అడుగు ఒక ప్రశ్నగా... ప్రతి నినాదం ఒక డిమాండ్‌గా... ప్రతి అడుగు ప్రభుత్వ తలుపు తట్టే శబ్దంగా మారే అవకాశం ఉంది. ప్రజలకు ఇళ్లు ఇవ్వాలని వార్త రాసే జర్నలిస్టులకు ఇళ్లు ఇవ్వడానికి మాత్రం ప్రభుత్వం వార్త కోసం ఎదురు చూడకూడదు!ఎందుకంటే... "ఇల్లు కట్టినవాడికి తాళం ఇవ్వాలి... పట్టా ఇచ్చినవాడికి హక్కు ఇవ్వాలి...సేవ చేసినవాడికి గౌరవం ఇవ్వాలి...లేకపోతే ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాలి!"జర్నలిస్టుల ఇళ్ల సమస్యపై ఇక "కాలయాపన"కు కాలం చెల్లిందా?లేక మరోసారి "త్వరలో... త్వరలో..." అంటూ ఫైళ్లను నిద్రపుచ్చుతారా?అక్టోబర్ 10న పాలమూరు నుంచి ప్రజాభవన్ దారి ఈ ప్రశ్నకు సమాధానం కోరబోతోంది.

# దశదిన కర్మ కు హాజరైన మంత్రి



**చిన్నంబావి, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి)**



చిన్నంబావి మండల పరిధిలోని గడ్డ బస్వాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి చిదంబరరెడ్డి మాతృమూర్తి మందడి లలితమ్మ దశదినకర్మ కార్యక్రమానికి కొల్లాపూర్ శాసనసభ్యులు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. మందడి లలితమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రారెడ్డి, జంగ బీచుపల్లి యాదవ్, వైస్ చైర్మన్ బిళ్ళ కంటి  విద్యాసాగర్‌రావు, మాజీ జెడ్పీటీసీలు ప్రతాప్‌గౌడ్, రవి, సర్పంచ్ వడ్డేమాన్ బిచ్చన్నతో పాటు పలువురు సర్పంచులు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని లలితమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.తదితరులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్య శాఖలో 49 పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**ఆలంపూర్ అక్టోబర్ 7(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో మొత్తం 49 పోస్టులను కాంట్రాక్ట్/అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్  బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా 49 పోస్టుల్లో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద 36,ఆయుష్ కింద 08,జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం (ఎన్‌టీఈపీ) కింద 05 పోస్టులు ఉన్నాయని తెలిపారు.అర్హత కలిగిన అభ్యర్థులు జిల్లా అధికారిక వెబ్‌సైట్ స్త్రుఃస-ఝుశ్రీ. వశ్రీఝఅస్త్రుఝుఖ. ప్రశీజ.ఱఅ నుండి దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్ చేసు కోవాలన్నారు.అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను 08-10-2026 నుండి 13-10-2026 సాయంత్రం 5:00 గంటల వరకు సమర్పించాలని సూచించారు. అలాగే పోస్టుల వారీగా ఖాళీలు, విద్యార్హతలు, వయో పరిమితి, ఎంపిక విధానం,దరఖాస్తు విధానం తదితర పూర్తి వివరాల కోసం జిల్లా అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.



# మూర్ఛకు కొత్త ఆశాకిరణం.. సెనోబమేట్!

- "మూర్ఛకు మందులే కాదు.. ఆధునిక చికిత్సలూ ఉన్నాయి!"
- డ్రగ్-రెసిస్టెంట్ ఎపిలెప్సీలో ఆధునిక చికిత్సకు మరో ముందడుగు
- సీజర్ లక్షణాలను తొలిదశలో గుర్తించాలి.. మందులు క్రమం తప్పకుండా వాడాలి
- సరైన నిద్ర, క్రమబద్ధమైన జీవనశైలి అత్యంత కీలకం

: ఎపిలెప్టాలజిస్ట్ డా. సాయి సతీష్ కంద్రాజు

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి బ్యూరో):**

మూర్ఛ (ఎపిలెప్సీ) అంటే కేవలం స్పృహ కోల్పోయి చేతులు, కాళ్లు కొట్టుకోవడం మాత్రమే కాదని, వివిధ రకాల సీజర్స్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స అందిస్తే మెరుగైన నియంత్రణ సాధించవచ్చని ప్రముఖ న్యూరాలజిస్ట్, ఎపిలెప్టాలజిస్ట్ డా. సాయి సతీష్ కంద్రాజు తెలిపారు.బుధ వారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతమంది రోగుల్లో అకస్మాత్తుగా ఒక చేయి లేదా కాలు అదుపు లేకుండా కదలడం, వింత వాసన లేదా అనుభూతి కలగడం, మాట ఆగిపోవడం, కొన్ని క్షణాలపాటు స్పందించకపోవడం వంటి లక్షణాలు కనిపించవచ్చన్నారు. ఇవి ఫోకల్ సీజర్స్‌కు సంబంధించిన లక్షణాలు కావచ్చని వివరించారు. శరీరం మొత్తం ప్రభావితమయ్యే జనరలైజ్డ్ సీజర్స్ కూడా ఉంటాయని, అందువల్ల ప్రతి సీజర్‌ను ఒకే విధంగా చూడకూడదని సూచించారు.

### మందుల క్రమశిక్షణే కీలకం

ఎపిలెప్సీ ఉన్నవారు వైద్యులు సూచించిన యాంటీ-సీజర్ మందులను క్రమం తప్పకుండా తీసుకోవడం అత్యంత ముఖ్యమని డా. సాయి సతీష్ పేర్కొన్నారు. వైద్యుల సలహా లేకుండా మందులను అకస్మాత్తుగా నిలిపివేయడం లేదా మోతాదును మార్చడం వల్ల సీజర్స్ తిరిగి వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తగినంత నిద్ర, క్రమబద్ధమైన జీవనశైలి, వ్యక్తిగతంగా సీజర్స్‌కు కారణమయ్యే ట్రిగ్గర్లను గుర్తించి వాటిని నివారించడం కూడా చికిత్సలో కీలకమైన భాగాలని తెలిపారు.

### రెండు మందులతోనూ సీజర్స్ తగ్గకపోతే..

సరైన రెండు యాంటీ-సీజర్ మందులను తగిన మోతాదులో ఉపయోగించినప్పటికీ సీజర్స్ కొనసాగితే దానిని డ్రగ్-రెసిస్టెంట్ ఎపిలెప్సీగా పరిగణిస్తారని వివరించారు. అలాంటి రోగులకు కేవలం




మందులను మార్చడం మాత్రమే కాకుండా, అవసరాన్ని బట్టి ఎపిలెప్సీ సర్జరీ,  వి ఎన్ ఎస్ వంటి పరికర చికిత్సలు, ఇతర ఆధునిక చికిత్సా విధానాలను కూడా పరిశీలించాల్సి ఉంటుందని చెప్పారు.

### సెనోబమేట్‌తో కొత్త అవకాశాలు

డ్రగ్-రెసిస్టెంట్ ఫోకల్ ఎపిలెప్సీ చికిత్సలో సెనోబమేట్ భారతదేశంలో అందుబాటులోకి రావడం మరో ముఖ్యమైన చికిత్సా ఎంపికను అందిస్తోందని డా. సాయి సతీష్ తెలిపారు. క్లినికల్ అధ్యయనాల్లో కష్టతరమైన ఫోకల్ ఎపిలెప్సీ ఉన్న కొంతమంది రోగుల్లో సీజర్ నియంత్రణతో పాటు సీజర్-ఫ్రీ స్థితి కూడా సాధ్యమైనట్లు వెల్లడైందన్నారు. అయితే సెనోబమేట్‌ను ప్రతి ఎపిలెప్సీ రోగికి ఇవ్వాల్సిన సాధారణ మందుగా భావించకూడదని స్పష్టం చేశారు.రోగి పరిస్థితికి అనుగుణంగా సరైన ఎంపిక, నెమ్మదిగా మోతాదు పెంచడం, ఇతర మందులతో ఉండే పరస్పర ప్రభావాలను పరిగణనలోకి తీసుకోవడం అవసరమన్నారు."డ్రగ్-రెసిస్టెంట్ ఎపిలెప్సీ అంటే చికిత్సకు మార్గం లేదని కాదు. సరైన నిర్ధారణ, మందుల క్రమశిక్షణ, అవసరమైనప్పుడు ఆధునిక చికిత్సలను ఉపయోగించడం ద్వారా అనేకమంది రోగుల్లో మెరుగైన జీవన నాణ్యత సాధించవచ్చు." అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ బి. సుదర్శన్ రెడ్డి, రోహిత్ కుమార్ పాల్గొన్నారు.

# దశదినకర్మకు హాజరైన బీఆర్ఎస్ మాజీ ఎంపీపీ,జడ్పీటీసీ

**చిన్నంబావి, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి)**

చిన్నంబావి మండలం గడ్డబస్వాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి చిదంబరెడ్డి మాతృమూర్తి మందడి లలితమ్మ దశదినకర్మ కార్యక్రమంలో బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నంబావి మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతి నిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు హాజరై మందడి లలిత మ్మకు ఘనంగా నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీ కేశిరెడ్డి వెంకట రమణమ్మ చిన్నారెడ్డి, మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ మధు సూదన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పుష్పలత తదితరులు లలితమ్మ చిత్రపటానికి





పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లలితమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. లలితమ్మ మృతి కుటుంబ సభ్యులకే కాకుండా ఆమెను అభిమానించే వారందరికీ తీరని లోటని అన్నారు. ఆమె కుటుంబంతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. దుఃఖంలో ఉన్న మందడి చిదంబరెడ్డి కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కేశిరెడ్డి చిన్నారెడ్డి, ఉలుపాల మహేశ్వర్‌రెడ్డి, దొడ్ల శ్రీధర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తగరం కురుమయ్య, వడ్డేమాన్ రామకృష్ణ, ఎత్తం కృష్ణయ్యతో పాటు వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.